"నీకేం గురూ! నువ్విట్లాగే అంటావ్. నేనింకా బోలెడంత చదవాలి."

"ఇవ్వాళ నీరజ క్లాసుకి రాదుట."

"మాంచాలి పిక్చర్ చాలా బావుంది."

"మాంచాలి, పాంచాలి గాదండోయ్! 'మన్‌చలీ' అది."

"హాస్టల్ ఖాళీ చేసేద్దామనుకుంటున్నాన్రా. న్యూసెన్స్‌గా ఉంది."

"శ్రీనాథుడు స్పెషల్ అపర్ తీసుకొంటే చదవలేక చావాలి. ఫోక్ లిటరేచరైతేనే సుఖం."

"సారీ! నా నోట్సు లెవరికీ యివ్వనోయబ్బా. నేను చదువుకోవాలి."

"ఏమే! పెళ్ళయిం తర్వాత స్టడీస్ కంటిన్యూ చేస్తావా?"

"ఉద్యోగం దొరికితే ఈ ఎమ్మే డిస్కంటిన్యూ చేస్తాను గురూ."

"గుడ్ మార్నింగ్ అలాఫ్ యూ.

ఓరి పీనుగా. ఇవ్వాళ వీడి వేషం పూర్తిగా మారిపోయిందే! అసలు



తెలుగు ఎమ్మేలో వీడికి సీటెలా యిచ్చారో! "నాన్నగారికి, ఇక్కడ నాకు ఇబ్బందిగా ఉన్నది. త్వరలో రెండు వందలు పంపగలరు" అని వాళ్ళ నాన్నకి సరిగ్గా ఉత్తరం రాయడం చేత కాదు వీడికి. వీడు రేపు కాబోయే ఫస్టు క్లాస్ పోస్టు గ్రాడ్యుయేటు. ఆ రౌడీ ముఖం, చూడగానే చెప్పొచ్చు. నన్నడిగితే ప్రతివాణ్ణీ పర్సనల్‌గా ఇంటర్వ్యూ చేసి వాటి ముఖాన్ని బట్టి సీటివ్వాలి. అచ్చులు, హల్లులు తెలీని వీళ్ళంతా రేపు తెలుగు లెక్చరర్స్ అయి 'చారు తులసీ దళదమ'కి చిలకమర్తి వారి గణపతిగా అర్థం చెప్తుంటే దేశం ఏమైయ్యేట్టు? గోపీచంద్ నవల ఒకటి సిలబస్‌లో ఉంటే బాగుండేది. ఈమార్పు రావాలంటే ఒక శతాబ్దం పడుతుంది. ఇప్పటికి నన్నయ,తిక్కనే గతి. గతి గతి సీతాపతీ చాపేగతీ....

ఒక్కసారిగా వాన వెలిసినట్లు నిశ్శబ్దం. నలభై అయిదు శాల్తీలు నిలబడ్డ చప్పుడు. లెక్చరర్ వస్తున్నాడు. రాజా వెడలే సభకూ- ఇరుగడలను డాల్ కత్తులు మెరయగ -అటెండెన్సు జిస్టరు, డస్టర్ మెరయగ.... క్లాసుకూ- నలభై అయిదు శాల్తీలు కూలబడ్డవైనం, బెంచీలు కిర్రు కిర్రు 'ఫట్ పట్' అరె ఝూ ఝూ ఝటక్ ఫటక్ హింసనచణ ధ్వంసరచన! కూర్చుంటుంటే కాళ్ళల్లో కీళ్ళు మెటికలు విరిచినట్లుగా కటక్ అంటుంటే అదోలా ఉంటుంది. అదో తమాషా అయిన తృప్తి. మళ్ళీ లేచి కూర్చుంటే! ఆల్‌రైట్, లెక్చరర్ ఇంకా సర్దుకుంటూనే ఉన్నాడు. మరోసారి.... కటక్ కటక్ భలే-మరోసారి.... కటక్ కటక్ ....నైస్ మళ్ళీ....కటక్ కటక్ .... వన్సెగైన్....

"వాట్ మిస్టర్ మూర్తీ! గుంజీలు తీస్తున్నావా?" లెక్చరర్.

అరెరే....సిల్లీ.ఇదేమి టిలాఅయింది.

"సారీసార్ సీటు సరిగ్గా లేదు"

"వేరేచోట కూర్చోమరి.ఎంతసేపని అట్లా తంటాలు పడతావ్"

సీటు మారాలి. ఫ్లోర్ మార్చాలి. పార్టీ మార్చాలి. రాజకీయమా వర్ధిల్లు. ఆడవాళ్ళపక్కన కూర్చుంటే! ఈ దేశం ఇంకా అంత ముందుకి పోలేదు. ఒక మందు త్రాగ్గానే ఆడపిల్లగా మారి పోవాలి: మళ్ళీ త్రాగగానే మామూలుగా అవాలి.. అలాటి మందేదైనా వుంటే భలే ఉంటుంది.... ఆడపిల్లలా మారి పోయి రోజూ నీరజ ప్రక్కన అనుకుని రాసుకుంటూ కూర్చునేవాణ్ణి. ఆడపిల్లల్ని ఎలా ఎత్తుకుని ముద్దుపెట్టుకుంటారో? నేను చిన్ని పాపాయిగా ఉన్నప్పుడు ఎంతమంది ఆడవాళ్ళు ఎత్తుకుని ముద్దాడారో నన్ను. బుగ్గలమీద ముద్దులవర్షం కురిపించి ఉంటారు, ఇప్పుడున్న ఊహ అప్పుడుండి వుంటే నా సామి రంగా....ఛీఛీ ఎంత హీనంగా ఆలోచిస్తున్నాను. సీక్రెట్ సెంటిమెంట్స్‌కి సమాధి కడుతున్నాను. నీరజని ఎవడు పెళ్ళిచేసుకుంటాడో. లక్కీఫెలో. వాడే నేనైతే, నేనే వాడైతే.. ఇవ్వాళ కాలేజీకి రాలేదే.

తనముఖంతప్ప ఇంకెవర్నిచూడాలన్నా అసహ్యం. నీరజెప్పుడూ ఎలా చదువుతున్నారని నన్నడగదేం? ఒక్కసారి

ఓ నోట్సిస్తారా అని అడగ్గూడదూ నన్ను ఆ కృష్ణగాణ్ణే అడుగుతుంది' వాడికెంత గ్లామర్ క్లాసులో. బ్రిల్లియంటైతే మట్టుకు వాడి తెలివితేటలన్నీ వీళ్ళకంటుతాయా ఏమిటి? ఇదేమిటి వీళ్ళంతా రాసి పారేస్తున్నారు. 'లింగ్విస్టిక్స్' నోట్సు డిక్టేటు చేస్తున్నాడు–గురుడు. నేనూ రాయాలి. లేకపోతే ఎవడూ నోట్సివ్వడు. ఒక్కలం.... ఛ ఛ.... దొంగలం.... కొడుకుల సలే మెసలే సమాజంలో ఒక్కడూ నోట్సివ్వడు. రాసెయ్యాలి. చెప్పినంత వరకూ పేజీలు ఖాళీ వదిలేసి చెప్పేది రాసెయ్యాలి. కానీవోయ్ .... ఓపెన్ యువర్ బుక్ మై బాయ్....ఓకే ఓకే.... కానీ కానీ కానీవోయ్ రసనిర్దేశం....లేదబోయ్ శోభాలేశం. కళ్ళుంటూ ఉంటే చూసీ పెన్నుంటూ ఉంటే రాసీ.... శోభాలేశం. శోభ కూడ రాస్తున్నది. దాని బొంద. ఏ అ క్ష రా ని కీ ఒ త్తులూ, పొల్లులూ ఉండవు. అక్షరాలకి ఒత్తుల్లేక పోలేనేం.ఆకారంలో వొంపు లున్నాయి అందుకే ఎకనమిక్స్ మీసాల ఎలుగ్గొడ్డు వెధవ దీన్ని పట్టాడు. వీళ్ళిద్దరూ కలిసి తిరుగుతుంటే ఎంతమంది ఎన్నిసార్లు చూశ్ళేదు! నేనూ చూశాను. చూశాను చూశాను.లాండ్స్కేప్–ప్రోద్యాన నికుంజాభ్యంతరంలో – క్రీడా శూన్యవిన్యాసాలెన్నెనో చూశాను.భేష్ భేష్ నాకూ కవిత్వం వచ్చేస్తున్నది. సమాసాలు గుప్పించి పారేస్తున్నాను. దీన్ని వెంటనే నోట్ చేసి వినిపించాలి. ఈ కవితావేశానికి కారణం శోభ ప్రేమాయణం సో–శోభకి థాంక్స్. మైడియర్ శోభా ! నీవు రోజూ మీసాల ఎలుగ్గొడ్డుగాడితో తిరుగుతూ ! నన్ను కవిగా చేయుమా ! నోట్ చేసెయ్యాలి కవిత్వాన్ని. లాండ్స్కేప్స్.... ఉద్యానవన.... మర్చిపోయాను. ఇక చచ్చినా గుర్తు రాదు. ఎన్నెన్నో చూశాను....నాన్సెన్స్ గుర్తురాదు.మనసులోని మాటని వెంటనే గ్రంథస్థం చేసే అసిస్టెంట్ కావాలి. పెద్దన్న బాబులాగా కవిత్వం చెప్తాను. శోభ పేజీ తిప్పింది. వీళ్ళంతా రాస్తూనే ఉన్నారు. నేనింకా మొదలుపెట్టలేదు. నోట్సు రాసేశానంటే ....ఇవ్వాళ నీరజ క్లాస్కి రాలేదు గాబట్టి నోట్సు నీరజ కివ్వొచ్చు. నీరజ ముట్టుకున్న నోటుబుక్కుని ముద్దుపెట్టుకుంటే చాలు. నా జన్మకిది చాలు. గురువుగారు చెప్పుకుపోతున్నాడు. నేను రాయాలి. నీరజా ! స్వీట్ నీరజా !నీకోసం రాస్తాను స్వీట్ నీరజా స్వీట్షాప్. శ్రేష్ఠమైన తినే సరుకు. నేతిసరుకు.మళ్ళీవెధవబుర్ర గుంటూరు పరిగెత్తింది. ఓకే తియ్ తియ్. పెన్ తియ్, గన్ తియ్ షటప్ పాడుమనసా— షటప్ ....పాడుమనసా ....పాడుశాంతా ....స్థా గానం, ఓ దివ్య నాద స్వరం ముందు – నాన్సెన్స్ .... పెన్ తియ్ ....తియ్ ....ట్లిప్, వండ్రఫుల్ జేబులోనుండి పెన్ తీస్తుంటే చిత్రమైన శబ్దం – ట్లిప్. మళ్ళీ తీద్దాం – ట్లిప్ .... ట్లిప్ ....ట్లిప్, ఈ సౌండ్లో ఏదో మ్యూజిక్ ఎప్పుడూ ఇలా చెయ్యాలనిపిస్తుంది. డాబోయ్........నోట్సు రాసెయ్యాలి డా బో య్. నీ రజా కోసమూ గోవిందారామ – నోట్సు రాసెయ్యాలి. గోవిందారామ.నీ రజా థాంక్సనీ గోవిందారామ – అంటేనే పదివేలు గోవిందారామ తియ్ తియ్ పెన్ తియ్....పెన్

తియ్....స్సప్—హో....గుడ్ : హీరో పెన్ కాప్ లాగగానే స్సప్ మంటూ రహస్యం ఊడిన చప్పుడు. మళ్ళీ ట్రై చేద్దాం....స్సప్.... మళ్ళీ.... స్సప్.... కళ్ళు మూసుకుని కాప్ పెట్టగలనా? అర్జునుడు చీకట్లో బాణాలు వేశాట్ట, ద్రోణుడు మెచ్చుకున్నాట్ట. నేనుకూడా కళ్లుమూసి పెన్‌కి కాప్ పెటేస్తాను. గురువుగారు మెచ్చుకుంటాడు. డెబ్బై మార్కులిస్తాడు. అబ్బా.... పాళీ చేతికి గుచ్చుకుంది. మళ్ళీ ట్రై చేద్దాం........ హో నైస్....అట్లా.... స్సప్....వన్సె గెన్....గుడ్.... స్సప్, గురువుగారూ నన్ను గోవిందరామ - మెచ్చుకుంటా దోయి గోవిందరామ.

"మిస్టర్ మూర్తీ : వాటీజిట్? పెన్‌తో సర్కస్ చేస్తున్నావ్?"

చూశాడు—ఇదేమిటిలాచిక్కిపోతున్నా నివాళ. అదిగో అప్పుడే అందరికళ్లూ నా వేపు చూస్తున్నయ్. నన్నో వెధవక్రింద జమకట్టి చూస్తున్నారు వీళ్ళంతా. అబ్బ. వీళ్ళ కళ్ళల్లో ఎంత తృప్తి. నన్నుగుచ్చి పారేస్తున్నారు. గ్రుచ్చి గ్రుచ్చి పారే స్తున్నారు. అదే నీరజ చూస్తే....పూల బాణాలు....

"ఇఫ్ యూ ఆర్ నాటింటరెస్టెడ్ - యూ కెన్ గో ఔట్ బై ఆల్ మీన్స్, అండర్‌స్టాండ్ అనేశాడు. అనేశాడు. అంతమాటా అనేశాడు. నా కేమయింది ఎమో ఏమో ఇది - నా కేమి ఏమి ఐనది - ఛస్ రబ్బిష్....ఏదోమూడింది. "సారీసార్ : పె.... .... పెంక్ అయి పోయింది." క్లాసంతా ఘొల్లున నవ్వులు నవ్వులుకాదు కసితో విసురు తున్న కత్తులు.

"సైలెన్స్ సైలెన్స్. మిస్టర్ మూర్తీ : నాతో కాదు నీ పరాచికాలు. మైండిట్."

"ఆ యామ్ రియల్లీ సారీ సార్ ఇంక్‌లో పెన్....నిజంగా...."

మళ్ళీ నవ్వులు. సూటిగా తన మీదికే. స్కౌండ్రల్స్. ఆ రాడీ వెధవ చూడు కావాలని ఎలా పెద్దగా నవ్వుతున్నాడో. ఒరేయ్ బండలం....కొడకా! మీ నాయ నకి డబ్బు పంప మని తప్పు లేకుండా లెటర్ రాయరా : నన్నుచూసి నవ్వు తున్నావ్. అయినా నీకేంలే, వడ్డించే వాళ్ళు నీ వాళ్ళున్నారు. ఫస్టు క్లాస్ గ్యారంటీ.

"ప్లీజ్ సైలెన్స్, ఆల్‌రైట్ -ఇదిగో నా పెన్ తీసుకో బి అటెంటివ్ ఇన్ క్లాస్.

పరీక్షలు కూడా దగ్గర పడు తున్నాయె. టేకిట్...." లెక్చరర్ పెన్ తీసి ఇస్తున్నాడు. టిప్.... భలే శబ్దం. మళ్ళీ తియ్యండి సార్ ఆ శబ్దం నా కిష్టం....

"థాంక్స్ సార్" ఇక నోట్సు రాయాలి పరీక్షలు దగ్గర బడుతున్నాయ్.

బి అటెంటివ్.... తప్పకుండా సార్ ఓలాగా ఆప్యాయంగా మాట్లాడే వాళ్ళు స్టాఫ్‌లో ఎవరున్నారు? నైస్.... కమాన్.... నోట్స్.... డిక్టేషన్.... సెక్రెట్రీ టేక్‌డౌన్.... మళ్ళీ పరుగెత్తు తున్నది మనసు. పాడుమనసు - పాడు శాంతా :....

నా గానం, మీ దివ్యనాదస్వరం.... ఛస్.... నోట్సు.... అమ్మ : గాడిలో

పద్మా. ఇక గో ఎహేడ్ ... మూవ్‌ఆన్, స్పీడ్ బ్రేకర్స్ ఎహెడ్. గోస్లో.... హెడ్ బ్రేకర్స్ ఎహెడ్ .... గోఎహెడ్ అబ్బబ్బబ్బ.... స్టార్ట్ .... వన్ టూ త్రీ.

రైట్.... A Phonenre is a small— ఫోనీమ్ .... ఫోన్ ఇవ్వము. ఒక్కసారి మీ టెలీ ఫోన్ వాడుకో. నిస్తారా సార్ .... ఓ అయామ్ సారీ. మా ఫోన్ ఎవ్వరికీ ఇ వ్వ న ం డీ.... ఫోనీము.... మి మ్మ ల్ని క్ష ఋ ం చీ ఫోనీము, రానీము, పోనీము... రానీము, ఫోన్ ఈము.... క్రింగ్ క్రింగ్ .... హలో ! మూ ర్తి స్పీకింగ్— హాో ! మార్నింగ్ నీరజా , ఫైన్, సాయంత్రం లాండ్‌స్కేప్స్ దగ్గిరా.... ష్యూర్.... రామకృష్ణాలో మంచి పి క్చ ర ు ం ది. క్వాలిటీ కెళ్ళి అక్కణ్ణించీ పిక్చర్ కెళ్దాం.... ఓకే.... మ ళ్ళీ మొ ద లు. ఇవ్వాళ నీరజ వొదిలి పెట్టదు నన్ను, నోట్సు రాయనివ్వదు. ఇక రాయలేను ఇవ్వాళ్టికి నోట్సు రాయలేను. బోర్ కొడుతున్నది, వెళ్ళిపోవాలి. బైటకి వెళ్ళాలి వెళ్తే బాగుండదు, పాస్ కెళ్ళాలని అడిగితే లేచి నిలబడి చిటికెన వేలు చూపించాలి ఛ ఛ, సిల్లీ. ఇంగ్లిష్! ఫరవాలేదు అడిగేస్తాను. త షా షా సరదా.

"ఎస్. ఎనీడౌట్ ?"

చచ్చాం.... అడిగాను .... ఇప్పుడెలా ? చిటికెనవేలు .... నాన్సెన్స్ .... ఎలా తప్పించుకోవాలి.... మళ్ళీ చిక్కిపోయినా. వాట్ టు డూ ? క్లాసులోంచి పరు గెత్తితే? .... వెళిపోవాలి లే క పో తే ప్రమాదం—కారు ఉండాలి. టుబినాట్ టూబి మెడియర్ హేమ్లెట్ .......... ఏం వాయ్‌మై డియర్ షేక్స్‌పియర్ ?

"వాట్ మూ ర్తీ ! టెల్‌మీ. ఎనీ డౌట్ ?"

డౌట్ .... తెలుగు క్లాసులో ఇంగ్లిషు. ఇది దేశానికి పట్టిన జాడ్యం.... అయ్యో! మీరు దయచేసి తెలుగు మాట్లాడండి గురూగారూ ....

"ఏమిటయ్యా అలా సిగ్గుపడిపోతు న్నావ్? వా ట్స్ ది మేటర్ ? టెల్‌మి

"అబ్బే.... అదే .... అదే సార్ .... ఆఁ.... లింగ్విస్టిక్స్‌కి ఎన్ని మార్కులు ఉంటాయండీ ?"

"సిడౌన్ ! ఇంతవరకూ నీకు సిలబస్ తెలీదు, పేపర్ మోడల్ తెలీదన్నమాట. ఇదంతా నీకు తెలీదంటే నే న్నమ్మను. చదువి స్తే నె త్తికెక్కుతారు డోన్ట్ డిస్టర్బ్ బీ కేర్‌ఫుల్. అండర్‌స్టాండ్ ?"

అయిపోయింది. హతవిధీ.... అయి పోయింది. ఈయన పేపర్లో సున్నా మార్కులు. మంచివాడికి కోపం తెప్పిం చాను. ఏదో అయింది వ్వాళ. ఇన్నాళ్ళ ఇంప్రెషనూ గోవిందా రామ—ఇంతటితో సరి గోవిందారామ .... బాగా అయింది. మంచి శా స్తి జరిగింది. నా తలతిక్కకి తగినశా స్తీ అయింది. లేకపోతే చిటికెన వేలు చూపిస్తాట్ట ఫూల్. లేడీస్ టాయ్ లెట్ (Toilet) 'ఐ' తీసిపారేస్తే .... లేడీస్ టులెట్ .... జెంట్స్‌టులెట్. యూరినల్స్‌లో ఎవడో ప్రబుద్ధుడు ఎదు రుగా రాశాడు. 'డోంట్ షేక్' అని.

ఆ కంపులో నిలబడి తీరిగ్గా ఎవ రాస్తారో! ....

ఆ .... ఆవులింతలు .... ఆవులు

గేదెలు .... గేదెలింతలు. ఇంతలు కన్ను లుంత తెరువెవ్వరి పేడెదు .... అవు లింతలు .... సెకండ్ షో సినిమాలకి వెళ్ళకూడదు. వెళ్తే మర్నాడు క్లాసుకు రాకూడదు. వస్తే అవులింతలు. వస్తే నిద్ర.

రానీ అవులింతలు రానీ, నిద్రరానీ, రానీ వస్తేరానీ, పోనీ, సతుల్ సుతుల్ హితుల్ పోనీ ! పోనీ .... ఏం సినిమా నిన్న వెళ్ళింది ? అదృష్టవంతుడు. కరెక్టు ప్రోడ్యూసర్ అదృష్టవంతుడు. పిచ్చి జనం అమాయకత్వాన్ని డబ్బు చేసు కున్న అదృష్టవంతుడు. మొదట్లో హీరో దొంగ. తరవాత మంచివాడై పోతాడు.

కానీ మాజీ దొంగకి ఎవ్వడూ పని ఇవ్వడు. సంసారం గడవాలి. హీరో మళ్ళీ దొంగగా మారే ప్రమాదముంది. అందుకని హీరోయిన్ నైట్ క్లబ్‌లో డాన్సు చేసి సంసారం గడుపుతుంది. భర్తదొంగయితే అప్రదిష్ట. భార్య నైట్ క్లబ్‌లో డాన్సు చేస్తే పరువు, ప్రతిష్ట. వందరోజులు పుల్. ఈ ప్రజలకి దేవుడే దిక్కు. ఈ దేశానికి దేవుడే దిక్కు. ఈ క్లాసుకి_నీరజే దిక్కు.నీరజ వదిలిపెట్టదు. ఇంతేఇంతే....ఇకఇంతే...."మనసు గతి ఇంతే – మనిష బ్రతుకింతే...." ఎవ డింత పెదగా ట్రాన్సిష్టర్ పెట్టుకొని పోతున్నాడు? కాలేజీకి రేడియో లెందుకు తెస్తారో ? వాడి సంగితి మనకెందుకు, నోట్సు రాసేయ్....మనసుగతి ఇంతే.... ఇంతే – ఇక పాట వదిలిపెట్టదు. మెదడు చుట్టూ వలపన్నేసింది_గుండెచుట్టూ కోట కట్టేసింది. మనసున్న మనిషికీ .... ప్రేమనగర్ సినిమా భాస్కర్‌తో కలిసి విజయావాడతో చూశాను. ఈ పాట విన గానే అక్కడ వాడితో గడిపిన మూడు రోజులూ గుర్తొస్తయ్. కొన్ని పాటలు వింటుంటే ఏవో స్మృతులు మనసులో మెదులుతుంటయ్. ట్రాన్సిష్టర్‌గాడు వెళ్ళి పోయాడు.తలవొంచుకొనే వెళ్ళిపోయావా ఛీ....పాపం. దిసీజ్ ఎ రాంగ్ కొటేషన్ ఎట్ ఎ రాంగ్ ప్లేస్....బ్లడీ ఇంగ్లీష్. నాకు సరిగ్గా ఇంగ్లీషు వస్తుందా? ట్రాన్సి ష్టర్‌గాడు మళ్ళీ వస్తాడా? కాలేజీ కారి డార్స్‌లో ఘంటసాల గానమాధుర్యాన్ని ప్రవహింపజేస్తూ తిరుగుతున్నాడు. ఈ క్లాసుల్లో కూర్చోవడంకంటే అదే మేలు. అబ్బా....! ఈ క్లాసు ఎప్పటికవుతుంది, ఈ జన్మకి కాదు నిద్ర, ఆకలి, విసుగు, చిరాకు అన్నీ క్లాసులోనే, అన్నీ ఒకే సారి. ఈగొర్రెలన్నీ పేజీలమీద పేజీలు త్రిప్పుతున్నారు. అరే ! నేనూ పేజీ త్రిప్పాలి. ఇదేమి టింతసేపూ ఇలా పిచ్చిగీతలు గీసేస్తున్నాను ! సున్నాలు, చుక్కలు, గీతలూ, ఆఠీను కళావర్లు; గజిబిజి గీతల మధ్య ఏవో మనుషుల ఆకారాలు. అయితే నేనూ శ్రద్ధగా రాస్తు న్నాననన్న మాట ఇంతసేపూ ... పాపం పూర్ లెక్చరర్, నా శ్రద్ధని మెచ్చు కొంటాడు. గురువుగారూ! నన్ను గోవిందా రామ....స్టాపిట్ .... స్టాప్.... హోల్డాన్....రైట్ రైట్....టంగ్ – స్టాప్; టంగ్ టగ్ – స్టార్ట్. ఇవ్వాళ కుర్చీలు పట్టి బస్సులో ఎక్కే ఓపిక లేదు. బస్సులో నిలబడే ఓపిక లేదు. ఆటోలోనో, టాక్సీ లోనో వెళ్ళే ఓపిక జేబుకి లేదు. బస్సే గతి, సీతాపతి చాపే గతి. ప్రొద్దున్న




బస్సులో సీత కనిపించింది. విద్యానగర్‌లో దిగిపోయింది. కడుపు. ఏమిటో కాసేపు ఏదోలా అయిపోయింది మనసు. కళ్ళముందరే, చిన్నచిన్న పిల్లలు అంతకంతకీ పెరిగి, ఏపుగా అందంగా తయారవుతారు. ఎప్పుడో ఒకరోజున మెళ్ళో మంగళమాత్రంతో, ప్రక్కనఒకఫూల్‌తో ఎదురుపడతారు. రోజూ కనిపించే అమ్మాయిలకి పెళ్ళయిపోతున్నదంటే ఏమిటో తెలీని అశాంతి మనసులో. వాళ్ళందర్నీ ఏదో చేసుకుందామని గాదు అదంతే.... ఏదో చెప్పటానికి వీల్లేని కలత, 'వేగ్ అగొనీ' ప్రతి పెళ్ళిళ్ళ సీజన్ లో ఇదింతే. పెళ్ళి సీజన్‌ని చిత్తకార్తె అంటాడు మా వెంకట్రావు మొన్నటి సీతకి నిన్న పెళ్ళి. ఇవ్వాళ కడుపు— అంటే సీతకూడా....

నాన్సెన్స్—హా....నిద్దర నెత్తిమీద కెక్కుతున్నది. పెన్ను పిచ్చిగీతలు గీస్తునే ఉన్నది. బల్లమీద తలకాయ పెట్టి కునుకు తీస్తే.... ఈ నోట్సు చెప్పడం ఇవ్వాళ్టికి ఆగదు. అలా చెప్తూనే ఉంటాడు. వీళ్ళు రాస్తూనే వుంటారు. నేను రాద్దామనుకుంటూనే ఉంటాను. బల్లమీద తల ఆనించేస్తాను. కనిపించను. ముందుసీట్లో చిట్టిబాబుగాడు కూర్చున్నాడు. చిట్టిబాబుగాడు అంత లావుగా శరీరం పెంచాడు. దీనివల్ల ఏం ప్రయోజనం అని ఎప్పుడూ అనుకునేవాణ్ణి. సృష్టిలో ప్రతిదానికీ ప్రయోజనం ఉన్నది. చిట్టిబాబుగాడి మహాకాయానికీ ప్రయోజనం ఉన్నది. వాడి వెనకసీట్లోవాడు లెక్చరర్ కంటబడకుండ హాయిగా నిద్రపోవచ్చు. థాంక్యూ మై డియర్ చిట్టిబాబూ! నీ శరీరం పదింతలుగా పెరగాలి.... నోట్సు నోట్సు.... డిక్టేషన్ .... పేజీలు తిరిగిపోతున్నాయ్.... పేగులు మాడిపోతున్నాయ్.... సీత కడుపుతో ఉన్నది. కడుపుతో ఆయాస పడుతూ నోట్సు రాస్తున్నది. స్పీడ్‌గా రాసేస్తున్నది. లెక్చరర్ గడగడా చదివేస్తున్నాడు. కలాలు రేసుగుర్రా

లాగా పరుగెత్తుతున్నయ్. పేజీలు నిండి పోతున్నయ్. తిరిగిపోతున్నయ్. చిరిగిపోతున్నయ్. నీరజ కలం మార్చింది. చెమటలు కారిపోతున్నయ్. పిల్లలు క్రింద కూర్చుని పలకల మీద బలపాలతో బుద్ధిగా రాసుకుంటున్నారు. పటౌడీ నవాబ్, గవాస్కర్ చేతికి 'గ్లాస్' తొడుక్కుని రాస్తున్నారు. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో ....! .... బాలసుబ్రహ్మణ్యం పాడుతూ నోట్సు రాసుకుంటున్నాడు. రోజారమణి నోట్స్ డిక్టేట్ చేస్తున్నది....

—ఒక్కసారిగా ఘొల్లున నవ్వులు—

వాట్ .... వాట్ హేపెన్డ్? ఒక క్షణం మగత నిద్రపోయాను. గవాస్కర్, పటౌడీ, బాలసుబ్రమణ్యం, రోజారమణి క్లాసులో .... పసిపిల్లలు .... వీళ్ళంతా నవ్వేశారు. మళ్ళీ చిక్కిపోయాను. కాదు చిక్కిపోలేదు. లెక్చరర్ ఏదో జోక్ విసిరినట్లున్నాడు. వీళ్ళంతా యధాశక్తి నవ్వేశారు. అదొక రకం ట్రిక్. నేను కనబడను. చిట్టిబాబుగాడు నాకూ, లెక్చరర్‌కీ మధ్య కోట కట్టేశాడు. అదిగో ట్రాన్సిస్టర్ వాలా మళ్ళీ వచ్చినట్లున్నాడు. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' పాట వస్తున్నది. ఈ పాటే కలలోకి దూరిపోయింది. చేరిపోయింది. అందరూ కలాలు మూసేశారు. ఇందాకటి జోకు తాలూకు నవ్వు ఇంకా వీళ్ళ ముఖాల మీద పూర్తిగా మాసిపోలేదు. లెక్చరర్ ధర్మ సూక్ష్మాలు వివరిస్తున్నాడు.

"మేమెంత చెప్పినా, మీరు కష్టపడి చదవందే లాభం లేదు.

మొదట్నించీ రెగ్యులర్‌గా చదువుతుంటే పరీక్షల ముందు కష్టం ఉండదు. ఎగ్జామ్స్ ముందు టీలు త్రాగుతూ, అలారం పెట్టుకొని లేస్తూ చదివి....

ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో .... చిత్రసీమ విన్నారు. ఆరోగ్యం పాడు చేసుకుంటే.... సరియైన టైమ్‌కోసం .... పరీక్షలు అసలు రాయలేరు .... గడియారాలనే వాతండి. ఓ. కే. ఆల్‌ది బెస్ట్.... వారి సమయం.... టంగ్ .... ధ్యాంక్యూ, గంటలు డింగ్‌డాంగ్ – టంగ్ టంగ్ టంగ్–

బెల్ అయింది. లెక్చరర్‌తోబాటు నలభై శాల్తీలు నిలబడ్డ శబ్దం.

కటక్ .... భలే .... మళ్ళీ .... కటక్,

లెక్చరర్ వెళ్ళిపోయాడు.

"ఈ నోట్సంతా గుర్తుంటుందంటావా గురూ ?"

"బైటినుంచీ భలే పాటలు వినిపించినయ్ గదూ !"

"చిన్న చిన్న స్లిప్స్‌మీద రాసేశాను గురూ ఏకంగా"

"ఏవడో ట్రాన్సిస్టరు .... రాయలేక చచ్చి .... బస్సుదొరికి చావలేక బ్రతకలేక...."

అబ్బబ్బబ్బ .... మళ్ళీ కాకిగోల మొదలు. గోల గో గో గో గోల. ఐ కాంట్ బేర్ ఇట్ .... ఐ మస్ట్ గో.... గో.... గో.... గోల.... గో....

●